# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1** **దేశవ్యాప్తంగా స్థానిక ఉత్పత్తులకు ప్రచారం కల్పించేందుకు చేపట్టిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి 2024-25 అవార్డుల కార్యక్రమం ఈరోజు ఢిల్లీలో జరగనుంది.**

**2.** **ప్రముఖ తెలుగు చలన చిత్ర నటులు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు హైదరాబాద్‌లో ముగిశాయి.**

**3.** **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**

**4.** **రాష్టాభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి. హరీష్ మాథూర్ తెలిపారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్ లోని అన్నమయ్య జిల్లాలో గత రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో 7 గురు మృతి చెందారు.**

==========================

దేశవ్యాప్తంగా స్థానిక ఉత్పత్తులకు ప్రచారం కల్పించేందుకు చేపట్టిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి 2024-25 అవార్డుల కార్యక్రమం ఈరోజు జరగనుంది. ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమంలో ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డు కింద ఎంపికైన ఉత్పత్తులకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ పురస్కారాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని 9 ఉత్పత్తులు ఈ పురస్కారాలకు ఎంపికైయ్యాయి.

కాగా.. ఒక జిల్లా ఒక ఉత్పత్తి పథకం కింద పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లేసు ఉత్పత్తికి సంబంధించిన పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ సి. నాగరాణి అందుకోనున్నారు.

మరోవైపు ఒక జిల్లా ఒక ఉత్పత్తి పథకంలో ఆంధ్రప్రదేశ్ కు జాతీయ పురస్కారాలు లభించడం గర్వకారణమని... చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో గత సాయంత్రం ఆమె పాత్రికేయలతో మాట్లాడుతూ, రాష్ట్రానికి మొత్తం 10 అవార్డులు రాగా, చేనేత, హస్తకళల విభాగంలో 7 పురస్కారాలు వచ్చాయని చెప్పారు. చేనేత కార్మికులకు ఉచిత కరెంటు పథకాన్ని వచ్చే నెల నుంచి అమలు చేస్తామని మంత్రి తెలుపుతూ,

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

ప్రముఖ తెలుగు చలన చిత్ర నటులు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు నిన్న ముగిశాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో కోట శ్రీనివాసరావు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.సినీ, రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించిన అనంతరం ఫిల్మ్ నగర్‌లోని ఆయన నివాసం నుంచి.మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర కొనసాగింది. అనంతరం కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలను నిర్వహించారు.

ఇదిలా ఉండగా హైదరాబాద్ లో కోట శ్రీనివాసరావు భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న నివాళులర్పించి.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్ 34 సెకన్లు

-----------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ రోజు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో రేషన్‌కార్డుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి ముఖ్యమంత్రి లబ్ధిదారులకు కార్డులను అందజేస్తారు. అనంతరం బహిరంగసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ ద్వారా 11 లక్షల 30 వేల మంది పేదలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

-----------------------------

వైద్య భద్రత ఆర్థిక సాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. వివిధ అనారోగ్య కారణాల రీత్యా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి మంత్రి నిన్న చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఆపద సమయంలో అత్యవసరంగా వైద్యం చేయించుకున్న వారికి ఈ సహాయనిధి ఉపయోగపడుతుందని మంత్రి వివరించారు.

-----------------------------

రాష్టాభివృద్దితో పాటు గ్రామాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి. హరీష్ మాథూర్ తెలిపారు. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగరపంచాయతీలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి, పోలవరం పనులుకు నిధులు తీసుకురాగలిగామని ఈ సందర్భంగా ఎంపీ తెలుపుతూ,

వాయిస్ 33 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో గత రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో 7 గురు మృతి చెందారు.

రాజంపేట నుంచి రైల్వేకోడూరు మార్కెట్‌కు మామిడికాయల లోడుతో వెళ్తున్న లారీ పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు కట్టపై బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 7 గురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, మృతులు రైల్వే కోడూరు మండలం శెట్టిగుంట గ్రామానికి చెందినవారిగా గుర్తించామని తెలిపారు.

మరోవైపు రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

---------------------------

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో ఈరోజు ప్రధాన ఘట్టమైన రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా నిన్న బోనాలు, ఫలహారబండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి మహాకాళి బోనాల జాతరకు హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టులో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి సోమవారం, శనివారాల్లో 07018 నంబర్ కలిగిన రైలు తిరుపతి నుంచి చర్లపల్లికి, ప్రతి శుక్ర, శనివారాల్లో 07017 నంబర్ కలిగిన రైలు చర్లపల్లి నుంచి తిరుపతికి రైళ్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది.

---------------------------

యాండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరిగిన 3వ టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ రెండవ ఇన్నింగ్స్‌లో 192 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్ కి దిగిన భారత జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే టీమిండియా ఇంకా 135 పరుగులు చేయాల్సివుంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని ఆంధ్రద్రేశ్‌లోని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================